క్లుప్తంగా

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 20, పచ్చిమిర్చి 45, బెండ 40, కాకర 40, దొండ 35, దోస 30, ఆలు 25, చామ 45, కీర 30, బీర 40, వంకాయ 50, గోకర 40, బీన్స్ 90, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 25, క్యారెట్ 50, చిక్కుడు 70, ఉల్లి 30 (1 కేజీ), ములక్కాయలు (3) 20, క్యాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 20–30, అల్లం 150, వెల్లుల్లి 160.

16 నుంచి 'విద్యలో ఏఐ'పై శిక్షణ

రాయదుర్గం: మనూ విశ్వవిద్యాలయంలో సెంటర్ ఫర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ ఆఫ్ ఉర్దూ మీడియం టీచర్స్ (సీపీడీయూఎంటీ) ఆధ్వర్యంలో 'విద్యలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్' అనే అంశంపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు సీపీడీయూఎంటీ డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ సమీ సిద్దిఖీ పేర్కొన్నారు. ఈ నెల 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అయిదు రోజుల పాటు ఆన్‌లైన్‌లో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. హైదరాబాద్‌లోని ఖురాన్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించే శిక్షణలో పాల్గొనేవారు ఉచితంగా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చని, పాల్గొన్నవారికి సర్టిఫికెట్లు అందించబడునన్నారు. మరిన్ని వివరాలకు సెంటర్ ఫ్యాకల్టీ డాక్టర్ మిస్బా అంజూర్(9948412484), డాక్టర్ మహ్మద్ అక్బర్(8373984391)లో సంప్రదించాలని కోరారు.

'సండే ఈవినింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. 'హెల్తీ అండ్ హ్యాపీ ఫ్యామిలీస్'(బాండింగ్ త్రూ ఫిజికల్ లిటరసీ) అనే అంశంపై దేశంలోని పలు ఫిజికల్ లిటరసీ పాలసీలో ఫిజికల్ లిటరసీ అడ్వకేట్ డాక్టర్ అమిత్ మాలిక్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040–23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

ఉచిత కంటి పరీక్షలు



శిబిరంలో పాల్గొన్న భిక్షపతి యాదవ్, రవికుమార్‌యాదవ్

హఫీజ్‌పేట్ : ప్రజలకు నిస్వార్థంగా సేవ చేస్తున్నామని మాజీ ఎమ్మెల్యే, ట్రస్ట్ చైర్మన్ భిక్షపతి యాదవ్ పేర్కొన్నారు. గురువారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని హఫీజ్‌పేట్ గ్రామంలోని హనుమాన్ టెంపుల్ వద్ద సందయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవ చేయడానికి అంకిత భావంతో ఉన్నామన్నారు. శిబిరంలో సుమారు 500 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమున్న వారికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్, నాగుల్‌గౌడ్, మహేష్ యాదవ్, శ్రీధర్ గౌడ్, లక్ష్మణ్, రవి గౌడ్, కృష్ణ యాదవ్, శంకర్ యాదవ్, రవి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికా బద్ధంగా కాలనీల అభివృద్ధి

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికా బద్ధంగా నిధులు కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని వివిధ కాలనీలలో రెండు కోట్ల 46 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు బుధవారం రాత్రి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నూతనంగా ఏర్పడిన అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో నేటి వరకు 70 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. గతంలో పంచాయతీగా ఉన్న సమయంలో ప్రజలు మంచి నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే వారిని, నేడు మున్సిపల్ పరిధిలో మూడు భారీ రిజర్వాయర్లు నిర్మించి ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

15 నుంచి బ్రహ్మోత్సవాలు

జిన్నారం(పటాన్‌చెరు): ఈనెల 15 నుంచి గుమ్మడిదలలోని కళ్యాణ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్, కరపత్రాలను గురువారం స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, అర్చకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఈనెల 15 నుంచి 20వ తేదీ వరకు జరిగే స్వామివారి బ్రహ్మోత్సవాల్లో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

దేశానికి కేసీఆర్ నాయకత్వం అవసరం

- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్
- కొల్లూర్‌లో 7,241 లబ్ధిదారులకు డబుల్ ఇళ్లు పంపిణీ



సెల్ఫీ దిగుతున్న లబ్ధిదారులు



లబ్ధిదారులకు ఇళ్లపట్టాలనందిస్తున్న ఎమ్మెల్యేలు గాంధీ, గోపీనాథ్

రామచంద్రాపురం (పటాన్‌చెరు): దేశానికి కేసీఆర్ నాయకత్వం ఎంతో అవసరమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. గురువారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ కేసీఆర్ నగర్‌లో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రధానంగా నిరుపేదల సొంత ఇంటి కలను నిజం చేసేందుకు కోట్ల విలువ చేసే భూముల్లో ఆధునిక సౌకర్యాలతో ఇళ్లను నిర్మించి ఒక రూపాయి ఖర్చు లేకుండా పేదలకు అందించారని తెలిపారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుంటే బీజేపీ, కాంగ్రెస్ నేతలు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారన్నారు.

ఎన్నికల సందర్భంగా మరోసారి వాగ్దానాలతో ప్రజలను మోసం చేసేందుకు ప్రతిపక్ష పార్టీలు సిద్ధమవుతున్నాయని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు భరోసానిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిహెచ్ఎంసీ వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, ఆర్డీఓ రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రధానరోడ్డుపై మురుగు



శేరిలింగంపల్లి: మురుగు నీరు వెళ్ళకుండా అడ్డుకోవడంతో ప్రధాన రోడ్డుపై నిలిచిపోయింది. దీంతో వాహనదారులు, స్థానికులు దుర్వాసనతో ఇబ్బందుల పాలవుతున్నారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల చౌరస్తా నుంచి తెల్లాపూర్ వైపు వెళ్లే రేడియల్ రోడ్డుపై మూడు రోజులుగా డ్రైనేజీ నిలవడంతో పరిసరాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి. తెల్లాపూర్ వైపు పోకుండా మూసివేయడం వల్లే సమస్య వస్తుందని వాపోతున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. దీనిపై సీవరేజ్ విభాగం సురేష్‌ను వివరణ కోరగా నాలుగు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామన్నారు.

పైపులైన్ లీకేజీ.. రోడ్డు గుంతలమయం

మియాపూర్ : ప్రధాన రహదారులలో తాగునీటి పైపులైన్ లీకేజీల కారణంగా రోడ్లు గుంతలు పడడంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. మియాపూర్ మదీనాగూడలోని విజేత సూపర్ మార్కెట్ పక్కన గల రోడ్డు మధ్యలో తాగునీటి పైపులైన్ లీకేజీ కావడంతో నీరంతా వృధా అవుతుంది. గతంలో లీకేజీ అయిన పైప్‌లైన్‌కు పలుమార్లు మరమ్మత్తులు చేసినా కొద్ది రోజులకే మరలా పైపులైన్ పగిలి నీరంతా రోడ్డుపాలవుతుంది. స్థానికులు పలు మార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. లీకేజీ ప్రాంతంలో రోడ్డు గుంతలు పడడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.



నల్లగండ్ల -తెల్లాపూర్ రోడ్డుపై డ్రైనేజీ

మళ్లీ అవకాశమిస్తే మరింత అభివృద్ధి చేస్తాం

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



సీసీరోడ్ల శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాయిబాబా తదితరులు

గచ్చిబౌలి/రాయదుర్గం/శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిని అన్ని రంగాలలో అగ్రగామిగా నిలపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం రూ.1.80 కోట్లతో లింగంపల్లి, తారానగర్, గోపీనగర్, నెహ్రూనగర్, సుదర్శన్‌నగర్, ఇందిరానగర్‌లలో సీసీరోడ్ల నిర్మాణానికి, గచ్చిబౌలి డివిజన్‌లో రూ. 2.98 కోట్లతో గుల్‌మోహర్‌పార్కుకాలనీ, నేతాజీనగర్, గోపన్‌పల్లి, టీఎన్‌జీఓకాలనీ, నానక్‌రాంగూడ, రాయదుర్గంలోని అంతర్గత రోడ్లను సీసీరోడ్లుగా మార్చే పనులకు ఆయన కార్పొరేటర్ రాగంనాగేందర్‌యాదవ్, గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి చరిత్రలో గతంలో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. అభివృద్ధిని చూసి ప్రజలు బీఆర్ఎస్‌కు మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేసుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు, ఏరియా కమిటీ మాజీ సభ్యులు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

బస్తీ సమస్యల పరిష్కారానికి కృషి



ప్రచారం చేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి రవీందర్‌రావు, బీజేపీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్‌రావు మార్పుకోసం బీజేపీ అనే నినాదంతో ప్రజా సమస్యలపై నిర్వహించే పాదయాత్ర డివిజన్ అధ్యక్షులు మాణిక్‌రావు అధ్యక్షతన ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన బీజేపీ నాయకులతో న్యూ కాలనీ, కాలపురం బస్తీలలో పర్యటించి స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో బస్తీలో సగం ఇళ్లు మునిగిపోతున్నాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అదే విధంగా డ్రైనేజీ సమస్య ఎక్కువగా ఉందని, డ్రైనేజీ నీరు పొంగి పొర్లి రోడ్డుపై పారుతుండటంతో దోమలకు ఆవాసంగా మారిందని తెలిపారు. దీంతో విష జ్వరాలు ప్రబలుతున్నాయని సమస్యను పరిష్కరించాలన్నారు. ఆయన స్పందిస్తూ సమస్యలన్నీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తానని తెలిపారు. బీఆర్‌యస్ పాలకులు సమస్యల పరిష్కారంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆకుల లక్ష్మణ్, విజయేంద్ర సింగ్, ప్రభాకర్, సిద్దూ, మన్యం, భాష, శివ, పాపయ్య, శ్యామ్, మహేష్, గోవింద్, బాలు పాల్గొన్నారు.

15 నుంచి శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని శ్రీ చిత్తారమ్మ దేవస్థానంలో ఈ నెల 15వ తేదీ ఆదివారం నుంచి 24వ తేదీ మంగళవారం వరకు శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు మాజీ చైర్మన్ నాయినేని శ్రీనివాసరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఓ ప్రకటనలో తెలిపారు. నవరాత్రులను పురస్కరించుకొని ప్రతి రోజు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ ఉంటుందని తెలిపారు. మొదటి రోజు 15వ తేదీ శ్రీ చిత్తారమ్మ అలంకారంలో దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటలకు విఘ్నేశ్వర పూజ, అఖండ దీపారాధన, పుణ్యాహవాచనము, మంటపారాధన, కలశ స్థాపన, కుంకుమార్చనలు, మహా హారతి, చండిహోమం, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలతో నవరాత్రి ఉత్స వాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ఉత్సవా ల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

బాల బతుకమ్మ పోస్టర్ ఆవిష్కరణ



ఆల్విన్‌కాలనీ: శ్రీ సాయి అలేఖ్య సంఘ సేవా సంస్థ ఆధ్వర్యంలో బాలల మీద తీస్తున్న పాట బాల బతుకమ్మ- రాజన్న ఫేమ్ అనే పోస్టర్‌ను గురువారం వ్యవస్థాపక అధ్యక్షురాలు అరుణ అశోక్ గొట్టిముక్కల పాండురంగారావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సాయి అలేఖ్య సంస్థ మంచి కార్యక్రమాలు చేస్తున్నందుకు అభినందనలు తెలుపుతున్నామన్నారు.

పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత కేసీఆర్‌దే

- దశలవారీగా అర్హులందరికీ డబుల్ ఇళ్లు
- ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వెల్లడి
- మూడోవిడత డ్రాలో 1,819 మంది లబ్ధిదారులకు ఇళ్లపత్రాలు పంపిణీ



డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పత్రాలను లబ్ధిదారులకు అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మూడవవిడత డ్రాలో 1,819 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ పత్రాలు పంపిణీ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లిలో మూడు విడతలలో 2,819 మంది లబ్ధిదారులకు ఇళ్లను అందించడం జరిగిందన్నారు. శేరిలింగంపల్లిలోని మొత్తం 2,819 లబ్ధిదారులలో దివ్యాంగులు–70, ఎస్సీలు–479, ఎస్టీలు–169, ఇతరులు–2,101 లబ్ధిదారులకు అందించామన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని అర్హులైన పేదలందరికీ దశలవారీగా డబుల్ ఇళ్లు కేటాయించడం జరుగుతుందన్నారు. ఇళ్ళ కేటాయింపు పారదర్శకంగా జరుగుతుందన్నారు. పేదవారు ఆత్మగౌరవంతో బ్రతకాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనువిందు.. కథక్



శిల్పారామంలో గుజరాత్ మేళాలో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా గురువారం జంట యోగిని కార్నోర్కర్ శిష్యబృందం కథక్ నృత్యప్రదర్శన ఇచ్చారు. ఇందులో గణేశవందన, రామశ్లోక, కృష్ణరాస్, క్రిస్‌వందన, తరణ, రాధాకృష్ణహోరి, కృష్ణభజన, గర్బ నృత్యాలతో అలరించారు. - మాదాపూర్

స్థలం, కాలానుగుణంగా సంస్కృతులు పుట్టుకొస్తాయి

హెచ్‌సీయూ తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

రాయదుర్గం: విశ్వైక భావనకు ప్రేరణే తులనాత్మక సాహిత్య అధ్యయనం అని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో అధ్యాపకులకు జరుగుతున్న తులనాత్మక సాహిత్యం పునశ్చరణ తరగతులకు రిసోర్స్ పర్సన్‌గా ఆన్‌లైన్‌లో హెచ్‌సీయూ తెలుగుశాఖ కార్యాలయం నుంచి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తులనాత్మక సాహిత్య అధ్యయనం వల్ల భిన్న భాషలలో గల సంస్కృతీ సాంప్రదాయాలు తెలుస్తాయన్నారు. స్థలం, కాలానుగుణంగా సంస్కృతులు, సాంప్రదాయాలు పుట్టుకొస్తాయని, దేన్నీ తక్కువగా చూడకూడదనే అవగాహన కలగడం కూడా తులనాత్మక అధ్యయన ప్రధాన కారణమన్నారు. తులనాత్మక అధ్యయనం ద్వారానే లోతుగా పరిశీలిస్తే ఒకరినొకరు పోల్చుకోవడం నుంచి మొదలై రాష్ట్రాలు, దేశాల మధ్య అనేక విషయాల్లో పోల్చుకోవడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సమన్వయకర్తగా ఆచార్య కె నాగేంద్ర, చర్చలో డాక్టర్ నిర్మల, డాక్టర్ శ్రీనివాస్, లెఫ్టినెంట్ డాక్టర్ షమీర్‌బాబు, ప్రముఖ కవి, రచయిత డాక్టర్ పొదిలి నాగరాజు సమీక్షతో వందన సమర్పణ సాగింది.

టీఎస్పీఎస్సీని ప్రక్షాళన చేయాలి



కూకట్‌పల్లిలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

కూకట్‌పల్లి: టీఎస్పీఎస్సీ గ్రూప్–1 పేపర్ రద్దుకు కారణమైన రాష్ట్ర ప్రభుత్వం, చైర్మన్ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఏబీవీపీ కూకట్‌పల్లి జిల్లా ఆధ్వర్యంలో కూకట్‌పల్లిలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి జిల్లా కన్వీనర్ ప్రతీక్ మాట్లాడుతూ... సాధించుకున్న రాష్ట్రంలో దశాబ్ద కాలంగా నిరుద్యోగులను గాలికొదిలేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగుల పట్ల శాపంగా మారిందని విమర్శించారు. పటిష్టమైన నిర్ణయాలు తీసుకోకుండా యువతను నిరుత్సాహ పరుస్తోందన్నారు. టీఎస్పీఎస్సీని ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ఆకాష్, నగర సంయుక్త కార్యదర్శులు ఆయుష్, రాఘవేంద్ర, నగర ఉపాధ్యక్షులు భరత్, మోక్ష, కార్యకర్తలు సంజయ్, వంశీ, జయప్రకాష్, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ కులస్తుల సంక్షేమానికి పెద్ద పీట

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- త్వరలో గౌడ కులస్తులకు 500 గజాల స్థలం కేటాయిస్తాం



పటాన్‌చెరు టౌన్: గౌడల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని, నియోజకవర్గ కేంద్రమైన పటాన్‌చెరు పట్టణంలో బహుజనుల యుద్ధ వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కాంస్య విగ్రహాన్ని అతి త్వరలో ఏర్పాటు చేయబోతున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని సాకి చెరువు కట్టపైన పటాన్ చెరు గౌడ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహ భూమిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వమూ గౌడ కులస్తులను పట్టించుకోలేదని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన అనంతరం సీఎం కేసీఆర్ నాయకత్వంలో గౌడ కులస్తుల సంక్షేమం కోసం పెద్ద ఎత్తున నిధులు కేటాయించడంతో పాటు 50 ఏండ్లు నిండిన ప్రతి గీత కార్మికుడికి రూ.2,016 పింఛన్ ఇస్తున్నారని చెప్పారు.చెట్టు పన్నులను రద్దు చేసి గీత కార్మికులకు అండగా ఉన్నది సీఎం కేసీఆరేనని గుర్తుచేశారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలో గౌడ కులస్తుల కోసం అతి త్వరలో 500 గజాల స్థలాన్ని కేటాయించబోతున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా శ్రీ ,జెడ్పీటీసీ సుప్రజా, స్థానిక కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, పటాన్‌చెరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పాండు, పట్టణ అధ్యక్షుడు అఫ్జల్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రమోద్ గౌడ్, గౌడ సంఘం ప్రతినిధులు వెంకటేష్ గౌడ్, రాజు గౌడ్, ధన్‌రాజ్ గౌడ్, ప్రతాప్‌కృష్ణ గౌడ్, టింకుగౌడ్, వేణు గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, దుర్గయ్యగౌడ్, సుధాకర్‌గౌడ్, విజయకుమార్‌గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

ఓటు అడిగే అర్హత కేవలం బీఆర్ఎస్‌కే ఉంది



ఐనోల్‌లో శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, నాయకులు

పటాన్‌చెరు: సీఎం కేసీఆర్ నాయకత్వంలో నియోజకవర్గంలోని ప్రతి గ్రామం అబ్బురపడేలా ప్రగతి సాధిస్తుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పది సంవత్సరాల కాలంలో ఎనలేని అభివృద్ధిని చేశారన్నారు. ప్రతి గ్రామంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపడుతూ పరిపాలన వికేంద్రీకరణ చేస్తూ బంగారు తెలంగాణ సాకారం చేశామని తెలిపారు.'గురువారం పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామంలో 3 కోట్ల 28 లక్షల రూపాయలు, ఐనోలు గ్రామంలో 2 కోట్ల 55 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇస్నాపూర్ గ్రామ పరిధిలోని సాయి తేజ కాలనీలో జీవిఆర్ ఎంటర్‌ప్రైజెస్ సౌజన్యంతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఐనోలు గ్రామంలో మాజీ సర్పంచ్ శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలతో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ప్రజల అవసరాలకు ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామసభల ద్వారా అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తూ పూర్తి పారదర్శకతతో పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ని ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, ఎంపీపీ సుష్మా శ్రీ ,జెడ్పీటీసీ సుప్రజా, ఆయా గ్రామాల సర్పంచులు ఉపేందర్, పద్మ వెంకటేష్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పాండు, మాజీ సర్పంచ్ శంకర్‌రెడ్డి సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, పంచాయతీరాజ్ డిఈ సురేష్, ఎంపీడీవో బన్సీలాల్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్ మాటలను నమ్మొద్దు

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రఘునాథ్‌యాదవ్



మియాపూర్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీ, బీఆర్ఎస్ మాయగాళ్లు వచ్చి మాయమాటలు చెప్పిమోసం చేస్తారని ప్రజలు వారితో జాగ్రత్తగా ఉండాలని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రఘునాథ్‌యాదవ్ అన్నారు. గడపగడపకు రఘన్న పాదయాత్రలో భాగంగా మియాపూర్ డివిజన్ ఎంఏనగర్ ,స్టాలిన్ నగర్ కాలనీలలో పర్యటించారు.ఈ సందర్భంగా ఆరు గ్యారంటీ పథకాలను వివరించారు. రాష్ట్రం దోపిడీకి గురికాకుండా ఉండాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలుస్తామన్నారు. ఇప్పటికే రూ.5లక్షల కోట్లు అప్పు చేశారని, రాష్ట్ర వనరులు ఎటుపోతున్నాయో తెలియదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ హామీలను ప్రతి డివిజన్, కాలనీ, బస్తీలలో విస్తృతంగా ప్రతి ఓటరు వద్దకు తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: సిద్ధిఖీనగర్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సిద్ధిఖీనగర్, అంజయ్యనగర్ కమ్యూనిటీ హాల్, అర్బన్ గ్రూప్ అపార్ట్‌మెంట్ ప్రాంతంలో విద్యుత్ ఉండదని వివరించారు.

- రోలింగ్ హిల్స్, రాజీవ్‌నగర్ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు అంజయ్యనగర్ మొత్తం, రోలింగ్ హిల్స్ విల్లాస్, వడ్డెరబస్తీ, రాజీవ్‌నగర్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందన్నారు.
- గౌతమీ సొసైటీ 11 కేవీ విద్యుత్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గౌతమీ సొసైటీ ఏరియాలో విద్యుత్ సరఫరాను నిలిపివేయడం జరుగుతుందని అధికారులు తెలిపారు.